## ఈ వారం కథ



# నేనూ మేనేజర్నే!

– వసుంధర

మా ఆఫీసులో బాస్ కాక ఎనమండుగురు మేనేజర్లున్నారు. అందర్నీ కలిపి నవగ్రహాలని మిగతా స్టాఫంతా ముద్దుగా పిలుచుకుంటాం. ఆ గ్రహాలన్నీ ఒక్కటి. మిగతా స్టాఫంతా ఒక్కటి.

రెండు వందల యాభై మంది స్టాఫుకీ మూడు యూనియన్లున్నాయి. ఉత్తప్పుడు మాలో మేం కొట్టుకుచస్తూనే ఉన్నాం. కానీ నవగ్రహాలతో ఏ గొడవొచ్చినా మేమంతా ఒక్కటి!

నేను పేరుకి ఒక యూనియన్లో వున్నా మిగతా రెండు యూనియన్సుతోటీ విరోధం లేదు. మూడు యూనియన్లూ ఎప్పుడు కలిసి కట్టుగా పనిచేసినా అది నా కారణంగానేనని తెలుసుకుని అంతా నన్ను గౌరవిస్తారు. అదీకాక నేనెప్పుడూ యూనియన్ నాయకత్వానికి దూరంగా వుంటాను.

ఇలా వుండగా నవగ్రహాల్లో ఓ గ్రహానికి ఫారిన్ ఛాన్సు వచ్చింది. ఆ ఖాళీ భర్తీచేయడానికి మా స్టాఫు నించి ఇంటర్వ్యూలు జరిగాయి. ఆరుగురు ఇంటర్వ్యూకి అటెండైతే అందులో నేనూ వున్నాను.

నాతోపాటు ఇంటర్వ్యూకి అటెండయిన మిగతా అయిదుగురూ ఏదో ఒక సమయంలో యూనియన్ నాయకులుగా వున్నారు. అందువల్ల ఇటు నవగ్రహాలకీ, అటు స్టాఫుకీ కూడా వాళ్ళంటే అంతగా కిట్టదు. ఇంచుమించు మూడు యూనియన్ల నించీ కూడా ఎక్కువ మంది కొత్త మేనేజరుగా నన్నే తీసుకోవాలని రిప్రజెంటేషన్సు వెళ్ళాయి.

ప్రమోషను వస్తే జీతం పెరుగుతుందన్న సంతోషం తప్ప నాకు మేనేజరు కావడం ఏ మాత్రమూ ఇష్టం లేదు. మేనేజరంటే నా సహోద్యోగుల మీద నేను పెత్తనం చెలాయించాలి. పెత్తందారు కావడం నా కిష్టం లేదు.

నా సహోద్యోగులు మాత్రం, "నువ్వు మేనేజరువైతే మేనేజర్ల పద్ధతులే మారిపోతాయి. స్టాఫులో మేనేజర్ల నారాధించాలనే బుద్ధిపుట్టి మన ఆఫీసులో కొత్త శకం ప్రారంభమవుతుంది" అన్నారు.

స్టాఫంతా నా మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారని అర్థమయింది. దాంతో నా బెంగ మరింత పెరిగింది.

నాకు మేనేజరుగా ప్రమోషనొచ్చింది.

నాతో పోటీపడ్డవారితో సహా మొత్తం స్టాఫంతా నన్నభినందించి, "ఇక మీదట మేనేజిమెంటుని నవగ్రహాలని అనకూడదు. నీవు బాసు, మేనేజర్స్‌లో కలవలేవు. వాళ్ళు ఎనమండుగురు, నువ్వొక్కడివి. వాళ్ళని నువ్వు అష్టదిక్పాలకులను చేస్తావు" అన్నారు.

ప్రమోషను కాదనలేక అంగీకరించాను కానీ నావాళ్ళ నుంచి నేను వేరైపోతున్నానన్న భయం కలిగి దిగులుగా వుంది.

ఇంటికి వెళ్ళి జరిగిందంతా భార్యకు చెప్పి బాధపడ్డాను.

నాకు ప్రమోషనొచ్చిందని భార్యాబిడ్డలు చాలా సంతోషించారు. శ్రీమతి నాతో, "మనసుకు ముఖం సూచిక అని ఇంగ్లీషు సామెత. బాధగా వుందని మీరు భ్రమపడుతున్నారంతే! మీ ముఖంలో సంతోషం స్పష్టంగా చూస్తున్నాను" అంది.

నన్నోదార్చాలని అబద్ధం చెప్పిందో, తన సంతోషపు ప్రతిబింబాన్ని నా ముఖంలో చూసుకుందో తెలియదుకానీ శ్రీమతి మాటలు నిజమైతే నాకు ఆశ్చర్యంగానే వుంది.

హైస్కూల్లో టెన్తు క్లాసు చదువుతున్న మా అబ్బాయి, "ఆఫీసుకు మేనేజర్లయినా, దేశానికి నాయకులైనా మనసులో అనుకున్నది ముఖంలో కనపడనివ్వరని మా హిస్టరీ మేస్టారు చెప్పారు. అంటే నువ్వు అసలు సిసలు మేనేజరువయ్యావన్న మాట!" అన్నాడు.

మేనేజరునైనా నేను నా స్టాఫుకు దూరం కాలేదు. వాళ్ళు నాతో ఎప్పటిలాగేవుంటున్నారు. మేనేజర్లు స్టాఫు మీటింగు పెట్టినపుడు మిగతా వాళ్ళ మాటలకు మధ్యలోనే చప్పట్లు కొడుతూ నా మాటలకు మాత్రం నిశ్శబ్దాన్ని పాటించి చివర్లో హిప్‌హిప్ హుర్రే అని మెచ్చుకునేవారు. ఎప్పుడైనా మేనేజిమెంటుకూ, స్టాఫుకూ గొడవ వస్తే అష్టదిక్పాలకుల్నీ పేరుపేరునా డౌన్‌డౌన్ అని నిరసన ప్రకటించేవారు. నన్ను మాత్రం పల్లెత్తు మాట అనేవారు కాదు.

బాస్ నాతో తరచుగా, "నువ్వు హోదాలోనే మేనేజరువి. మానసికంగా మాత్రం ఇంకా స్టాఫు స్థాయి నుంచి మేనేజరు స్థాయికి ఎదగలేదు" అనేవాడు. సాటి మేనేజర్లు వాళ్ళందరూ ఒక్కటిగా వుండి నన్ను వేరు చేసేవారు. నన్ను చిన్నచూపు కూడా చూసేవారు. బాస్ అభిప్రాయమే వాళ్ళది కూడా!

మేనేజరునైనా కూడా స్టాఫు గౌరవాన్ని పొందడం సామాన్యం కాదు. గౌరవంతోపాటు అభిమానం కూడా పొందడం ఇంకా విశేషం. అందువల్ల నా సంతోషానికి పట్టపగ్గాలుండేవి కాదు.

ఇంట్లో తరచుగా శ్రీమతికీ విషయం చెప్పేవాణ్ణి. ఆమె ఆశ్చర్యంగా "కానీ గతంలో మీరు చాలా సరదాగానూ, సంతోషంగానూ కనపడే

## రవికాలేజీపై పుకార్లు

– డైరెక్టర్ : C. V. N. ధన్ M.A.

**వివరణ**

**"తగ్గిపోయింది, వెనుకబడిపోయింది"**

అని మిత్రులు, శ్రేయోభిలాషులు అంటుంటే కొంచెం బాధ కలుగుతుంది. కాని వాస్తవం వేరు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు స్థాపించి, ప్రవేశపరీక్షపెట్టి, 110 మంది విద్యార్థులను ఎంపిక చేసి మంచి ఫలితాలను సాధిస్తుంది.

వాటికి పోటీగా, ప్రవేశపరీక్ష లేకుండా అంతేమంది విద్యార్థులను చేర్చుకొని అదే రకమైన ఫలితాలను ప్రత్యేకవ్యక్తిగత శ్రద్ధ చూపి, సాధించాలని మేం ప్రప్రథమంగా రవి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీని స్థాపించి అద్భుతఫలితాలను సాధిస్తూ వస్తున్నాం.

ఇంటర్‌లో 93 శాతం మార్కులు కూడా సాధించాం. ఆతరువాత ఎందరో మా మార్గాన పయనించాలని ప్రయత్నిస్తున్నారు. అయితేవారు అధికసంఖ్యలో విద్యార్థులను చేర్చుకొని ఆదాయం పెంచుకుంటున్నారు. మంది ఎక్కువైతే మజ్జిగ పలుచనవుతుందని మీకూ తెలుసు.

రెసిడెన్షియల్ కాలేజీకి ముఖ్యమైంది ప్రత్యేక వ్యక్తిగత శ్రద్ధ. అందుకని మేం విద్యార్థుల సంఖ్యను 110కి మించకుండా జాగ్రత్త పడుతున్నాం. ఇది గ్రహించలేని వారు, మా చరిత్ర, ఆశయం అర్థం చేసుకోలేనివారు కొత్తగా వచ్చినవారితో పోలుస్తూ పై వ్యాఖ్యానాలు చేస్తున్నారు. సహృదయులు మా ఆశయాన్ని అర్థం చేసుకోండి.

**1957లో స్థాపించబడి వేలాది విద్యార్థులను తీర్చిదిద్దిన సంస్థ. 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు జూనియర్ ఇంటర్ క్లాసులకు ఇంగ్లీషు, తెలుగు మీడియాలలో శిక్షణ.**

ESTd.1957
రవి కళాశాల
ఫోన్: 30117
3/7 బ్రాడీపేట, గుంటూరు-2

TARA.671

వారు. ఇప్పుడు మీ ముఖం చూడగానే ఏదో తెలియని అసంతృప్తితో బాధపడుతున్నారని అర్థమైపోతుంది. కారణం తెలియక నేనూ, పిల్లలూ కూడా సతమతమైపోతున్నాం. ఆఫీసులో మీకు పరిపూర్ణ తృప్తి వుందంటే సమస్య ఇంట్లోనే వుండి వుండాలి'' అంది. అప్పుడే ఆమె ఆశ్చర్యం బాధగా కూడా మారిపోయింది.

నా శ్రీమతి ఆదర్శ మహిళ. పిల్లలు ఆణిముత్యాలు. ఏం చెప్పాలో నాకు తెలియలేదు.

తీవ్రంగా ఆలోచించాను.

నేను మేనేజరునై ఆరు నెలలు దాటింది. కానీ ఇంతవరకూ స్టాఫుకి నా వల్ల ఒరిగినదేమీ లేదు. వాళ్ళ కోసం నేనేమీ చేయలేదు. వాళ్ళు నన్ను గౌరవించి అభిమానిస్తున్నారంటే అందుక్కారణం వాళ్ళ మంచితనం. నా గొప్పతనమేమీ లేదు. అందుకే వాళ్ళ గౌరవాభిమానాలు నన్ను అసంతృప్తికి గురిచేస్తున్నాయి.

స్టాఫు కోసం ఏమైనా చేయాలని నిర్ణయించుకున్నాను. నాలుగు రోజులు తీవ్రంగా కృషి చేసి కొన్ని కొత్త ప్రతిపాదనలు చేశాను. వాటిని బాస్‌కి వినిపించాను. బాస్ వెంటనే మేనేజర్లందర్నీ సమావేశపరిచాడు. అక్కడ ఓ ఫైలు తీసి అందరి ముందూ వుంచాడు. ఒకొక్కరే ఫైలు తీసి చూసి క్షణాల మీద పక్కవాడికి అందజేస్తున్నారు. ఆఖరున నా చేతికి ఫైలు వచ్చింది. అందులో నేను చేసిన ప్రతిపాదనలే వున్నాయి. నా ప్రతిపాదనలని మిగతా మేనేజర్లెవ్వరూ శ్రద్ధగా చదవనందుకు ఉక్రోషం వచ్చి బైటకు కక్కేశాను.

''నువ్వు సరిగ్గా చూడలేదు. ఆ ఫైలు నీకు సంబంధించినది కాదు. స్టాఫంతా నవగ్రహాలనే వాళ్ళు తయారుచేసి యూనియన్ నాయకులు అంగీకరించకపోతే ఆరేళ్ళ క్రితం మూసేసిన ఫైలిది!'' అన్నాడు బాస్.

అప్పుడు నేను ఫైలును శ్రద్ధగా చూశాను. బాస్ చెప్పిందాంట్లో అబద్ధం లేదు. అది పాత ఫైలే! చివర యూనియన్ నాయకులు అంగీకరించక ఫైలు మూసేసినట్లు రాసి వుంది.

''ఇందువల్ల స్టాఫుకెంతో ప్రయోజనం! నాయకులెందుకు కాదన్నారో అర్థంకావడం లేదు!'' అన్నాను.

''మేమంతా ఆకాశం నుంచి ఊడిపడలేదు. నీకులాగే మేమూ స్టాఫులోంచే పుట్టాం. ఆఫీసాక క్షీరసాగరమనుకుంటే మనమంతా కలిసి దాన్ని మథించి అమృతాన్ని వెలికి తీయాలి. ఈ ప్రయత్నంలో పుట్టిన హాలాహలం యూనియన్ నాయకులు. స్టాఫంతా కలిసి పరమశివుడిలా ఆ నాయకుల్ని తమ గొంతులో దాచుకుని గరళకంఠులవుతున్నారు. అమృతానికి దూరమవుతున్నారు'' అన్నాడు బాస్.

అందులో నిజమెంతుందో నాకు తెలియదు. కానీ అది మేనేజర్ల భాష అని నాకు తెలుసు.

''ఇందులో నాయకులకున్న ప్రయోజనం?'' అన్నాను.

''ఈ ఫైలు అమల్లోకి వస్తే మొత్తం స్టాఫంతా మేనేజిమెంటు గుప్పిట్లోకి వస్తారు. యూనియన్ నాయకుల గుప్పిడి ఖాళీ అయిపోతుంది. అది వాళ్ళ కిష్టముండదు'' అన్నాడు బాస్.

ఏది ఏమైనా నా కారణంగా ఈ ఫైల్లోని ప్రతిపాదనలు వెలుగుచూస్తే అష్టదిక్పాలకులు సంతోషిస్తామని చెప్పారు.

నేను రంగంలోకి దిగాను.. యూనియన్ నాయకులతో మాట్లాడితే వాళ్ళు జరిగింది నిజమేనని అంగీకరించి,''ఆ ఫైలులో యూనియన్లని నాశనం చేయాలని మేనేజిమెంటు పథకం వేసింది. ఒకసారి యూనియన్లు పోతే మళ్ళీ అందర్నీ కూడగట్టడానికి భగీరథ ప్రయత్నం కావాలి...'' అన్నారు.

''స్టాఫుకి మేలు జరుగుతూంటే యూనియన్లెందుకు?'' అన్నాను.

''యూనియన్లు కారణంగానే స్టాఫుకి మేలు జరుగుతోంది. ఎన్నికల పేరు చెప్పే కదా నాయకులు అయిదేళ్ళ కొకసారైనా కొన్ని వాగ్దానాలు నెరవేరుస్తున్నారు! నాయకులను సరైన దారిలో నడిపించడానికి ఎన్నికలెలా అవసరమో, మేనేజిమెంటును అదుపుచేయడానికి యూనియన్లు కూడా అలాగే అవసరం. యూనియన్లు పోతే మేనేజిమెంటు స్టాఫుని దోపిడీ చేయడం ప్రారంభిస్తుంది'' అన్నారు వాళ్ళు.

ఇది యూనియన్ల భాష అని నాకు తెలుసు.

''పోనీ ఈ విషయం స్టాఫు నడిగిచూస్తే?'' అన్నాను.

''వాళ్ళు తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ళు అనుకుంటారు. వాళ్ళకేం కావాలో వాళ్ళకే తెలియదు. మేనేజిమెంటు నవ్వుతూ ఉరితాడు వాళ్ళ చేతికందిస్తుంది. వాళ్ళు నవ్వుతూనే ఉరేసుకుని చస్తారు. అది ఆపడానికే మేము...''

''అయినా ఒకసారడిగి చూస్తాను...''

''వాళ్ళ గొంతుల్లో ఉండి పలికేది మేమే!'' అన్నారు నాయకులు.

బాస్ చెప్పిన గరళకంఠులన్న పదం గుర్తొచ్చింది.

